కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 25, పచ్చిమిర్చి 60, బెండ 40, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 40, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 250.

నేడు అన్నమయ్యపురంలో శ్రీసీతారాముల కల్యాణం

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మంగళవారం సాయంత్రం 6 కల్యాణ వేడుక నిర్వహించనున్నట్టు డాక్టర్ శోభరాజు తెలిపారు. అనంతరం అన్నమయ్య రచించిన రాముని పాటలను అలపించనున్నట్టు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌పార్టీలో చేరిక

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో సోమవారం చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్ గౌడ్ ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు రాజ్యలక్ష్మీ, మధులత, బాలస్వామి, మోజెస్, పోశెట్టిగౌడ్, యాదగిరి, ఫరూఖ్, ఖాలీమ్, భిక్షపతి, రవీందర్,దేవీ, సరిత తదితరులు ఉన్నారు.

'ఐఎస్‌బీ' పాఠ్య ప్రణాళికలో మార్పులు

రాయదుర్గం: దేశంలోని అత్యుత్తమ బిజినెస్ స్కూల్‌గా గుర్తింపు పొందిన గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్‌ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో కరికులమ్‌లో మార్పులు చేయాలని నిర్ణయించారు. అందుకు సంబంధించి ఐఎస్‌బీ నిర్వహించే కోర్సులలో ప్రధానంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ) కోర్సు కోసం ప్రస్తుతం ఉన్న పాఠ్య ప్రణాళికపై సమీక్ష చేసింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ కోర్సులో సమగ్ర పాఠ్యాంశ్య సమీక్షను ఆవిష్కరించింది. ఈ ఏడాది నుంచే పీజీపీ కోర్సులో మార్పులకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన సాధ్యం



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో పార్టీ నియోజకవర్గ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్

శేరిలింగంపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యమని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సునీతా ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చందానగర్ డివిజన చెందిన బీఆర్‌ఎస్ నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం హామీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.

శిల్పారామంలో సమ్మర్ ఆర్ట్ క్యాంప్

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో మే 1 నుంచి 17వ తేదీ వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మట్టికుండలు తయారు చేయడం, పెన్సిల్ స్కెచ్, మధుబని పెయింటింగ్, లిప్పన్ ఆర్ట్, సిషెల్ క్రాఫ్ట్, భగవద్గీత శ్లోకాలు, సంస్కృతంలో మాట్లాడడం వంటి అంశాలలో నామమాత్రపు రుసుముతో వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గలవారు 8886652030, 8886652004 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బీజేపీ వెంటే దేశ ప్రజలు



మాట్లాడుతున్న కొండ సంగీతరెడ్డి

హఫీజ్‌పేట్: దేశ ప్రజలంతా భారతీయ జనతా పార్టీ వైపే ఉన్నారని బీజేపీ పార్టీ చేవెళ్ళ ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీత రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మై హోమ్ జువెల్, కల్కి హైట్స్ గేటెడ్ కమ్యూనిటిలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల ప్రచారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబద్ధతతో దేశాభివృద్ధికి కృషి చేసిన నరేంద్ర మోడీని మరోసారి ప్రధానమంత్రి చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

వసతి గృహ సముదాయం కోసం భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణములో అర్చకులకు, సిబ్బంది వసతి గృహసముదాయానికి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహంను త్వరతగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని, నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ఆయల కమిటి సభ్యులకు తెలియజేశారు.

కంకణాల వసుమతికి నివాళి



హఫీజ్‌పేట్: సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ సతీమణి సీఆర్ ఫౌండేషన్ జనరల్ బాడీ, మహిళా సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యురాలు కంకణాల వసుమతి ద్వితీయ వర్ధంతి సభ సోమవారం సీఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవ రావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.రజిని పాల్గొన్నారు.

పూజలు

పటాన్‌చెరు టౌన్: దూలపల్లిలోని సీతారామచంద్రస్వామి, విశాలాక్షి విశ్వేశ్వర దేవస్థానాన్ని మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఇద్దరూ కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకుల సమక్షంలో శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రపాల్, కొంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు, రాజేష్ , రుద్రారం మాజీ సర్పంచ్ కుర్మ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పండుగలు వస్తేనే శుభ్రం చేస్తారా..

కొనేరులో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు • పట్టించుకోని అధికారులు, సిబ్బంది



కోనేరులో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు వేసిన దృశ్యం



చెరువులో తొలగించిన గుర్రెపు డెక్కను కోనేరు వద్ద వేసిన దృశ్యం

హఫీజ్‌పేట్: వినాయక చవితి, బతుకమ్మ పండుగలు వస్తే ఓ పవిత్రమైన ప్రదేశంగా భావించి గణనాథులు, బతుకమ్మలు నిమజ్జనం కోనేరులో చేస్తారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు వద్ద జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేకంగా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం కోనేరును నిర్మించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ రెండు పండుగలు వస్తే మాత్రం చేసే హడావుడి మామూలుగా ఉండదు. శుభ్రం చేసి రంగులు వేసి అలంకరణ చేస్తారు. మిగతా రోజులలో పట్టించుకునే అధికారి, సిబ్బంది ఉండరు. పండుగలు ముగిసిన తరువాత వాటి వైపు చూడరు. కోనేరు శుభ్రత కోసం ప్రత్యేక నిధులు కేటాయించిన వాటిని ఉపయోగించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చుట్టు పక్కల కాలనీ వాసులు ఇష్టానుసారంగా చెత్త చెదారం తీసుకువచ్చి కోనేరులోనే వేస్తున్నారు. పవిత్రంగా ఉండాల్సిన కోనేరు పూర్తిగా చెత్తతో నిండి దుర్గంధంగా మారుతోంది. పండులకు మాత్రం కోనేరులో ప్రత్యేక నిధుల ద్వారా శుభ్రమైన నీరు తీసుకువచ్చి నింపుతారు. మిగితా రోజులో మురుగు నీరు నిల్వ ఉంటుంది. ఇప్పటికైన అధికారులు కోనేరును ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్‌శాతం పెంపుపై అధికారుల దృష్టి



బొటానికల్‌గార్డెన్ గేటు ముందు ఏర్పాటు చేసిన పోలింగ్ బ్యాలెట్ నమూనా

శేరిలింగంపల్లి: పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్థానిక అధికారులు అనేక చర్యలు తీసుకుంటున్నారు. అన్ని చోట్లా పోలింగ్ తేదీ, నమోనా బ్యాలెట్ పేపర్ తరహాలో ఒక కటౌట్ తరహాలో ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా జన సమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అందులో భాగంగా శేరిలింగంపల్లి లోని బొటానికల్ గార్డెన్‌లోని ప్రధాన గేటు వద్ద ఈ బ్యాలెట్ నమూనా కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఈ బోర్డుపై 'ఐ విల్ ఓట్ ఆన్ మే 13' అని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ విషయాన్ని శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఇలాంటివి శేరిలింగంపల్లిలో పలు ప్రధాన చోట్లలో, జనసమూహం ఎక్కువగా ఎప్పటికీ అగుపించే చోట్లలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్యూటీరంగంలో విప్లవాత్మకమైన మార్పు



డ్రైబై బ్యూటీ లగ్జరీ బ్యూటీ బార్‌ను ప్రారంభిస్తున్న సినీ నటులు హరితేజ, నవ్యస్వామి

సినీ నటి హరితేజ

సాక్షి, సిటీబ్యూరో: బ్యూటీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని సినీ నటులు హరితేజ, నవ్యస్వామిలు పేర్కొన్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం శుభపరిణామన్నారు. సోమవారం ఖాజాగూడలో అమోఘ అల్యూర్ సంస్థ ఏర్పాటు చేసిన డ్రై బై లగ్జరీ బ్యూటీ బార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగర మహిళలు తమ అందానికి మెరుగులు దిద్దుకోవడానికి ఎంత ఖర్చు అయినా పెట్టేందుకు సిద్ధమవుతున్నారని కానీ పెరిగిన టెక్నాలజీతో ప్రస్తుతం తక్కువ ఖర్చుతోనే బ్యూటీ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో పలువురు బుల్లితెర నటులతో పాటు నటి నీహారికా సూద్, స్పోర్ట్స్ యాంకర్ నేహ, ఆర్‌జే, రవళి పాల్గొన్నారు.

అక్షయ పాత్ర వంటశాల ఆధునీకరణకు సహకారం



భోజనాలను సరఫరా చేసే వాహనాలను ప్రారంభిస్తున్న సంస్థల ప్రతినిధులు

మణికొండ: నార్సింగిలోని అక్షయపాత్ర ఫౌండేషన్ వంటశాలను ఆధునికీకరణ చేసేందుకు జెమిని ఎడిబుల్స్ సంస్థ తనవంతూ సహకారాన్ని అందించింది. ఇప్పటివరకు 37 వేల మందికి ప్రతిరోజు వండే ప్రస్తుత వంటశాల సామర్థ్యాన్ని 50 వేలకు పెంచడంతో పాటు ఆహారాన్ని త్వరగా సరఫరా చేసేందుకు అవసరమైన మూడు వాహనాలను సోమవారం అందజేసింది. వాటిని జెమిని ఎడిబుల్స్ సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు, ట్రస్టీ సత్యగౌర చంద్ర దాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్షయపాత్ర ట్రస్టీ సభ్యుడు మాట్లాడుతూ నార్సింగిలోని వంటశాలను ఆధునీకరించాలన్న తమ లక్ష్యంలో మరో ముందడుగు పడిందన్నారు. రూ. 2 కోట్ల నిధులతో వంటశాలలో మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించడంతో పాటు విద్యుత్ వాహనాలను అందించడంతో పిల్లలకు చేసే సేవలో సమర్థత, స్థిరత్వాల్లో నూతన ప్రమాణాలను ఆవిష్కరిస్తామన్నారు. అక్షయ పాత్ర సీఈఓ శ్రీధర్ వెంకట్ మాట్లాడుతూ సామాజిక సంక్షేమంపై జెమిని ఎడిబుల్స్ సంస్థ తన నిబద్ధతను చాటుకుందని కొనియాడారు. కార్యక్రమంలో రెండు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

500 టన్నుల బియ్యం పట్టివేత



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

- రూ.1.05 కోట్ల విలువ
- 3 లారీలు, 4 డీసీఎంలు సీజ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రూపేష్

పటాన్‌చెరు టౌన్: ఓ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 500 టన్నుల రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్న సంఘటన పటాన్‌చెరు మండలం బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండల పరిధి పాశమైలారంలో సోమవారం డీఎస్పీ రవీందర్ రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రూపేష్ వివరాలు వెల్లడించారు. సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా పాశమైలారం గ్రామంలో అక్రమంగా నడుపుతున్న ఓ రైస్ మిల్లుపై దాడులు నిర్వహించారు. రూ.1.05 కోట్ల విలువైన సుమారు 500 టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ టౌన్‌కు చెందిన ప్రభాకర్ రెడ్డి కొంత కాలంగా అనుమతులు లేకుండా రైస్ మిల్లును నిర్వహిస్తున్నాడు. ప్రభుత్వం నుంచి ధాన్యం కొనుగోలు చేసి బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐ గోదాంకు తరలిస్తుంటాడు. అయితే ప్రభాకర్ రెడ్డి వివిధ ప్రాంతాల నుంచి ప్రభుత్వ పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేయిస్తాడు. వాటిని ఎఫ్‌సీఐ గోదాంకు తరలించి అధిక లాభాలను అర్జిసుంటాడు. ఇలా పాశమైలారంలోని మిల్లులో సుమారు 500 టన్నుల రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు పక్కా సమాచారం అందడంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. బియ్యాన్ని సీజ్ చేసి రవాణాకు ఉపయోగించే మూడు లారీలు, నాలుగు డీసీఎంలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితుడు ప్రభాకర్ రెడ్డి పరారీలో ఉన్నాడని, ప్రస్తుతం పాశమైలారం మిల్లు నడిపిస్తున్న రవిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో విజిలెన్స్ ఎస్పీ శశిధర్ రాజు, అదనపు ఎస్పీ సంజీవ రావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, బీడీఎల్ భానూర్, సీఐలు రవీందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ ప్రవేశపెట్టిన సంకల్పపత్ర మేనిఫెస్టో

గచ్చిబౌలి: బీజేపీ ప్రవేశ పెట్టిన సంకల్పపత్ర మేనిఫెస్టో హర్షణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మసీదుబండలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో మరో అయిదేళ్ళు పరిపాలించాలనే సకల్పంతో 14 ముఖ్యమైన అంశాలను పొందుపరిచి దేశ ప్రజల హృదయాలను గెలుచుకున్నారన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ తమ లక్ష్యమని కమలనాధులు చెబుతున్నారని ఆయన గుర్తు చేశారు.

పాఠశాలల అభివృద్ధికి చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఎంపీపీ రవీందర్‌గౌడ్ తెలిపారు. మండల వ్యాప్తంగా 31 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట ప్రభుత్వం రూ.70 లక్షల నిధులు కేటాయించింది. అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కలిసి ఎంపీపీం సోమవారం సమీక్షించారు. మండలంలోని 31 పాఠశాలల్లో విద్యార్థులకు తగిన మౌలిక సదుపాయాలను కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వాటి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

భూపాల్ రెడ్డిని కలిసిన ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శాసనమండలి మాజీ ప్రోటేం చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ మెదక్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి మాట్లాడుతూ మెదక్ సెగ్మెంట్‌లో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల డైరెక్టర్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, నాయకులు జగన్నాథ్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

సందడి చేసిన చిన్నారులు



రాయదుర్గం: నృత్యాలు, స్కిట్లతో సందడి చేస్తూ అందరినీ చిన్నారులు ఆకట్టుకున్నారు. రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని సరస్వతీమాతకు పూలమాలలు సమర్పించి జ్యోతి వెలిగించి అతిథులు ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు, స్కిట్లు అందరినీ ఆకట్టుకోగా, తల్లిదండ్రులు తమ చిన్నారులను చూసి మురిసిపోయారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో ఎన్‌ఎస్‌యూఐ సమావేశం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఉప్పర్‌పల్లి సామ భూపాల్ రెడ్డి గార్డెన్‌లో ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. మీటింగ్‌కు హాజరైన జాతీయ ఎన్‌ఎస్‌యూఐ కార్యదర్శి ఫాద్, ప్రభుత్వ సలహదారు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరించి కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గం నుంచి 20 వేల ఓట్ల మెజార్టీ సాధిస్తూ మొత్తం 1,40,000 ఓట్లను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, నేషనల్ ఇన్‌చార్జి రాష్ట్ర డెయిరీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కస్తూరి నరేందర్, మహిళా ఉపాధ్యక్షురాలు సదాలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాజు, బి-బ్లాక్ అధ్యక్షుడు మహ్మద్ ఖాలేద్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.ధనుంజయతో పాటు ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఉప్పర్‌పల్లి ప్రాంతంలో రంజిత్ రెడ్డి ప్రచారాన్ని చేపట్టి ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

సంక్షేమమే ధ్యేయం.. అభివృద్ధే ఎజెండా

చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి



గోపన్‌పల్లితాండలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి

రాయదుర్గం: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమమే ధ్యేయంగా, అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పనిచేస్తుందని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ జి రంజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లితాండలో ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని, అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ప్రకటించిన న్యాయ గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. అంతకుముందు గోపన్‌పల్లితాండలోని గిరిజన మహిళలు తమ సాంప్రదాయ దుస్తులు ధరించి కాంగ్రెస్ నాయకులకు ఘన స్వాగతం పలుకడం విశేషం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

టీఆర్‌ఎస్‌పార్టీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు రాజు నాయక్, పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో చేవెళ్ళ అభ్యర్థి డాక్టర్ జి రంజిత్‌రెడ్డి పార్టీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

అగ్నిప్రమాదాలపై సమాచారం ఇవ్వాలి

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి



అగ్నిమాపక వారోత్సవాల బ్యానర్లను ఆవిష్కరిస్తున్న సీపీ అవినాష్ మహంతి

గచ్చిబౌలి: అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే వెంటనే అగ్నిమాపక శాఖ నెంబర్ 101కు సమాచారం అందించాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. జాతీయ అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా రంగారెడ్డిజిల్లా అగ్నిమాపక సేవల శాఖ అధికారులతో కలిసి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను, పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరుగకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అగ్ని భద్రతను నిర్ధారించండి, దేశాభివృద్ధికి సహకరించండి అనే థీమ్‌తో ఈ ఏడాది అగ్నిమాపక వారోత్సవాలు జరుపుతున్నారని గుర్తు చేశారు. రంగారెడ్డిజిల్లా ఫైర్ ఆఫీసర్ ఎస్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కువగా వేసవిలో కిచెన్, గోడౌన్‌లలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కె విజయ్‌కుమార్, మాదాపూర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ టి జగన్‌మోహన్, మరో ఫైర్ ఆఫీసర్ ఎంఏ ఫజల్, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు సాధికారత కల్పించడమే లక్ష్యం



ఎస్కీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న వారితో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు

ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు

రాయదుర్గం: పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువతకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఎస్కీ ఆధ్వర్యంలో 'ఏఐ-మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్-ఉద్యోగ పాత్రపై దృష్టి సారించే నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ మార్గదర్శకత్వంలో కేంద్ర నైపుణ్యా భివృద్ధి శాఖ పీఎంకేవీవై4.0 స్పాన్సర్ చేసిన ఫ్లాగ్‌షిప్ చొరవతో ఈ కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్కీ నాణ్యయైన శిక్షణలు ఇవ్వడంతో పాటు పలు కోర్సులను కూడా నిర్వహిస్తూ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన వారిని తయారు చేసి అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఆర్‌ఈసీ డీన్, హెచ్‌ఓడీ వేణుగోపాలరావు, ఇన్‌చార్జీ డాక్టర్ అఖిల్‌ఖరే,ప్రిన్సిపల్ డాక్టర్ జి కనకదుర్గ, వైస్‌ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్‌జీఎస్‌మూర్తి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మియాపూర్: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా బూత్ కమిటీ సభ్యులు కలిసికట్టుగా పని చేయాలని చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మియాపూర్‌లోని నరేన్ గార్డెన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శేరిలింగంపల్లి అబ్జర్వర్, తెలంగాణ టూరిజం అండ్ డవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్,ఎంబీసీ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జె.జైపాల్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాబోయే ఎన్నికల్లో బూత్ కమిటీ సభ్యుల పాత్ర కీలకమని, భూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బూత్ కమిటీ సభ్యులు రాబోయే ఎన్నికల వరకు కష్టపడి పనిచేసి హస్తం గుర్తుకు వేయించి తనను గెలిపించాలని ఆ తర్వాత మీ కోసం, ప్రజల కోసం నేను కష్టపడి పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, భూత్ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నీలం మధుకు సూచనలు ఇస్తున్న మంత్రి దామోదర

పటాన్‌చెరు టౌన్: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. సోమవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌తో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికలలో అనుసరించాల్సిన అంశాలపై వారు చర్చించారు. మెదక్ లోక్‌సభ పరిధిలోని మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాలలో నెలకొన్న పరిస్థితుల గురించి మధును మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యూహాలపై మంత్రి పలు సూచనలు చేశారు.

బెల్‌లో షూటింగ్‌లు బంద్

- అనుమతి ఆపేయాలని కోరిన కార్మికులు
- షూటింగ్ సెట్ల తొలగింపు



సినిమా సెట్‌ను తొలగిస్తున్న దృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రకృతికి పుట్టినిల్లు అయిన బెల్ టౌన్‌షిప్‌లో సినిమా షూటింగ్‌లతో సందడిగా ఉంటుంది. గతంలో సినిమా షూటింగ్‌లను నిలిపివేసిన బెల్ యాజమాన్యం తిరిగి రెండేళ్లుగా అనుమతి ఇస్తుంది. షూటింగ్‌ల కారణంగా కోట్ల రూపాయలు రాబడి వచ్చింది. నిత్యం కాలనీలో సుమారు మూడు నుంచి నాలుగు షూటింగ్‌లు జరిగేవి. నెల రోజుల క్రితం బెల్ యాజమాన్యం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో కార్మికులు టౌన్‌షిప్‌లో సినిమా షూటింగ్‌లకు పర్మిషన్ ఇవ్వకూడదని కోరినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో సినిమా షూటింగ్‌ల కోసం వేసిన సెట్‌లను తొలగిస్తున్నారు. సినిమా షూటింగ్‌లు నిలిపివేయడం కారణంగా ఇటు బెల్ యాజమాన్యం, అటు వ్యాపారులు ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది.